క్లుప్తంగా

పోలమాంబ సన్నిధిలో హోం మంత్రి అనిత



ఆలయంలో పూజలు చేస్తున్న హోం మంత్రి అనిత

ఏయూ క్యాంపస్: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం పెదవాల్తేరులోని పోలమాంబ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులతో కలిసి పోలమాంబ అమ్మవారికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హోం మంత్రికి పండితులు ఆశీర్వచనం అందించగా, దేవాదాయ శాఖ అధికారి కె.శిరీష, ఆలయ ఈవో గాయత్రి తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

బీఆర్‌టీఎస్‌లో ఆటో బోల్తా



రోడ్డుపై బోల్తా పడిన ఆటో

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో సంజయ్‌గాంధీ కాలనీ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఆటో బోల్తా పడింది.స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. హనుమంతవాక నుంచి ఆరిలోవ వైపు ఓ ఆటో మితిమీరిన వేగంతో వెళ్తూ సంజయ్‌గాంధీ కాలనీ వద్ద డివైడర్‌ను ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడి నుజ్జయింది. ఆటోకు ముందు, వెనక భాగాలు పూర్తిగా పాడయ్యాయి. ఆటోలో ఉన్న కొందరు యువకులు స్వల్ప గాయాలతో పరారయ్యారు. ఆటోలో కొందరు ఆకతాయిలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో దగ్గరలో వేరే వాహనాలు లేకపోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రాణహాని జరగలేదు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆటోను రోడ్డు పక్కకు తరలించి కేసు నమోదు చేశారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్

సీతంపేట: సమాజంలో బ్రాహ్మణుల మనుగడకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని వివిధ వర్గాలకు చెందిన బ్రాహ్మణ ప్రముఖులు పిలుపునిచ్చారు. వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యువ రాజకీయ వేత్త ద్రోణంరాజు శ్రీవత్సవ్ మాట్లాడుతూ సమాజంలో అందరూ బాగుండాలని కోరుకునే వారిలో మొదటి వారు బ్రాహ్మణులేనని, అలాంటి వారు నేడు దుర్భర స్థితిలో ఉన్నారన్నారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్యా, వ్యాపార రంగాల్లో బ్రాహ్మణుల ఎదుగుదలకు అవరోధం కలిగించే శక్తులు ఎన్నో ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయి కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. న్యాయవాది కె.వి.నరసింహమూర్తి మాట్లాడుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ భవన్‌కు కొంత స్థలాన్ని కేటాయించగా.. దానికి కంచె వేశామన్నారు. బ్రాహ్మణ సంఘాల పేరిట ఇవ్వాల్సిన ఆ స్థలాన్ని బ్రాహ్మణ కార్పొరేషన్, దేవదాయ శాఖ సంయుక్త పేరిట ఇవ్వడంతో దానికి క్లియరెన్స్‌లో జాప్యం జరిగిందని చెప్పారు. ఏపీ బ్రాహ్మణ ఐక్య వేదిక కన్వీనర్ సీవీఎస్ సాయిరామ్, వైద్యులు విజయశేఖర్, వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కావూరి చరణ్, సంస్థ గౌరవాధ్యక్షులు టీఎస్సార్ ప్రసాద్, వివిధ సంఘాల ప్రతినిధులు నెమ్మలూరి శివగణేష్, దివాకర్, హనుమంతరావు, మహంతి, డాక్టర్ వాణి తదితరులు భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

- 11వ వార్డు గెడ్డ స్థలంలో అనధికారిక నిర్మాణాలు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



బాలాజీనగర్ వెనక శ్రీహరినగర్‌లో గెడ్డ అంచున నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం



బాలాజీనగర్ గెడ్డ అంచున చేపడుతున్న అక్రమ నిర్మాణం

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డులోని ఓ గెడ్డ ఆక్రమణకు గురవుతోంది. గెడ్డ అంచున పచ్చదనం కోసం కేటాయించిన స్థలాల్లో అనధికారిక భవనాల నిర్మాణం యథేచ్ఛగా సాగుతోంది. దీంతో గెడ్డలు ఇరుకుమయంగా మారుతున్నాయి. 11వ వార్డు పరిధి కొంబాల కొండ వెనక భాగం నుంచి ఓ గెడ్డ.. కైలాసనగర్, డ్రైవర్స్ కాలనీ, శ్రీహరినగర్, బాలాజీనగర్, గాంధీనగర్, తోటగరువు మీదుగా పెదగదిలి వద్ద మరో పెద్ద గెడ్డలో కలుస్తోంది. గతేడాది మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సూచనతో జీవీఎంసీ అధికారులు గెడ్డలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇక్కడ గెడ్డను ఆధునికీకరించారు. సుమారు రూ.5 కోట్లు జీవీఎంసీ నిధులు ఖర్చు చేసి గెడ్డ అడుగు భాగంలో కాంక్రీట్‌తో ప్లాట్ ఫారం, ఇరువైపులా ఎత్తయిన గోడలు నిర్మించారు. ఇరుపక్కలా గెడ్డకు సంబంధించిన ఖాళీ స్థలాలు ఉంచారు. ఆ ఖాళీ స్థలాల్లో గ్రీనరీ(పచ్చదనం) ఏర్పాటు చేసి సుందరీకరణ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. బాలాజీనగర్ యూపీహెచ్‌సీ నుంచి అటు కైలాసనగర్, శ్రీహరినగర్ వరకు, ఇటు గాంధీనగర్ వరకు గెడ్డకు ఇరువైపులా ఖాళీ స్థలాలు ఉన్నాయి. జీవీఎంసీ అధికారులు పచ్చదనం కోసం కేటాయించిన ఆ స్థలాలు ఇప్పుడు ఆక్రమణకు గురవుతున్నాయి. గెడ్డను ఆనుకొని ఆ స్థలాలను ఆక్రమించి కొందరు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. బాలాజీనగర్ వద్ద గెడ్డ అంచున సుమారు 150 చదరపు గజాల స్థలంలో ఓ వ్యక్తి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. రెండు రోజుల్లోనే గోడలు నిర్మించి పెయింటింగ్ కూడా వేసేశాడు. దానిపై ఇప్పుడు యథేచ్ఛగా నిర్మాణం చేపట్టేస్తున్నాడు. దీనికి సమీపంలో బాలాజీనగర్, శ్రీహరినగర్ మధ్యలో గెడ్డ అంచున మరో వ్యక్తి కూడా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. వీటి పక్కన ఉన్న మిగిలిన ఖాళీ స్థలాలను కూడా ఇంకొందరు ఆక్రమించే ప్రయత్నంలో చదును చేయిస్తున్నారు. పచ్చదనం కోసం కేటాయించిన స్థలాలు ఆక్రమణకు గురై అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత సచివాలయంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, జీవీఎంసీ జోన్–2 టౌన్ ప్లానింగ్ సిబ్బంది చేతి వాటం వల్లే ఈ ఆక్రమణలు ఇక్కడ జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో రూ.కోట్లు ఖర్చు చేసి గెడ్డల ఆధునికీకరణ చేపడితే, ఈ ప్రభుత్వంలో అవే గెడ్డలు ఆక్రమణలకు గురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గెడ్డల అంచున చేపట్టిన అక్రమణ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి, ఖాళీ స్థలాలకు రక్షణగా కంచె నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

ఏయూ మెస్‌ల ఆకస్మిక తనిఖీ



మెస్‌లను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ కిషోర్‌బాబు, ప్రిన్సిపాళ్లు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థుల మెస్‌లను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్ట్స్ కళాశాల, సైన్స్ కళాశాల, రీసెర్చ్ స్కాలర్స్, మహారాణిపేటలోని విద్యార్థినుల మెస్‌లను పరిశీలించారు. కిచెన్‌లో పరిశుభ్రత, ఆహార పదార్థాల రుచి, నాణ్యత వంటివి ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి మెస్‌లలో సిబ్బంది ప్రవర్తన, పనితీరు, భోజన నాణ్యతపై ఆరా తీశారు. భోజనం నాణ్యతపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మెస్‌లలో పలు మార్పులు చేయాలని కోరారు. వాటికి త్వరలో పరిష్కారం చూపుతామని రిజిస్ట్రార్ హామీ ఇచ్చారు. తరచూ మెస్‌లను తనిఖీ చేస్తామని, నాణ్యతలో రాజీ పడొద్దని సిబ్బందికి సూచించారు. మెస్‌లలో పని చేస్తున్న సిబ్బందితో నేరుగా మాట్లాడారు. రుచిగా, శుచిగా భోజనం అందించడానికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్‌లు బి.మునిస్వామి, కె.రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 18 నుంచి కనకమ్మ జాతర




సమావేశమైన జాతర కమిటీ సభ్యులు

మద్దిలపాలెం : పాత వెంకోజీపాలెం గ్రామ దేవత శ్రీకనకమ్మ అమ్మవారి జాతర వచ్చేనెల 18వ తేదీ నుంచి నిర్వహించాలని గ్రామ సేవా సంఘాలు నిర్ణయించాయి. శ్రీసీతారామ సేవా సంఘం, శ్రీరాధాకృష్ణ యాదవ సంఘం, శెట్టి బలిజ సేవా సంఘం ఈ మేరకు ఆదివారం సమావేశమై జాతర తేదీలను ఖరారు చేశాయి. 18న చాటింపు, 19న తొలేళ్ల, 20న అమ్మవారి ప్రధాన జాతర జరగనున్నాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయనున్నామన్నారు.

కొత్త కార్యవర్గం ఏర్పాటు

పాత వెంకోజీపాలెం శ్రీరాధాకృష్ణ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఒమ్మి ముత్యాలరాజు, ఉపాధ్యక్షుడిగా పల్లా పెంటారావు, ప్రధాన కార్యదర్శిగా ఒమ్మి కోటి, తదితరులు ఎన్నికయ్యారు.

ఉత్సాహంగా రథయాత్ర



ప్రత్యేక అలంకరణలో శ్రీజగన్నాథస్వామి



ఎంవీపీ కాలనీలో సాగుతున్న రథయాత్రలో పాల్గొన్న భక్తులు

ఎంవీపీ కాలనీ: శ్రీజగన్నాథస్వామి రథయాత్ర ఎంవీపీ కాలనీలో ఆదివారం అట్టహాసంగా సాగింది. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో సాయంత్రం ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులోని ఐఐఏఎం వద్ద రథయాత్ర ప్రారంభమైంది. అక్కడ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ కూడలి, ఇసుకతోట హైవే మీదుగా వెంకోజీపాలెం, ఎంవీపీ క్యాన్సర్ ఆస్పత్రి కూడలి మీదుగా రథయాత్ర అప్పుఘర్ బీచ్ రోడ్డుకు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి ఎంవీపీ డబుల్ రోడ్డు వరకు కొనసాగింది. ఈ యాత్ర ప్రారంభం సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించిన భక్తదాస మాట్లాడుతూ శ్రీ జగన్నాథస్వామి రథయాత్ర వేదిక పంచాంగంలో ప్రాముఖ్యత పొందిందన్నారు. భారతీయ సంప్రదాయంలో ప్రేమకు, భక్తికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఏటా హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో రథయాత్రను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మంగవేణి, ద్వారక ఏసీపీ ఎస్.రాంబాబు, వెలగపూడి ప్రతాప్, సుంకరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. యాత్రలో దారి పొడవునా సంప్రదాయ, సాంస్కృతి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన యాత్ర 8 గంటల వరకు కొనసాగింది. అనంతరం స్వామివారికి మంగళ హారతి పట్టారు.

బీచ్ రోడ్డు: సాగర్‌నగర్ ఇస్కాన్ సంస్థ, ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆదివారం నిర్వహించిన రథయాత్రలు ఉత్సాహంగా సాగాయి. వీఎంఆర్డీఏ పార్కు నుంచి బయలుదేరిన ఇస్కాన్ యాత్ర హరేకృష్ణ మహామంత్ర సంకీర్తనలు, కోలాటం, భజనలు, జై జగన్నాథ్ నామస్మరణతో మార్మోగింది. వైఎంసీఏ, కాళీమాత ఆలయం, రామకృష్ణా బీచ్, రామకృష్ణామిషన్ మీదుగా సిరిపురం గురజాడ కళాక్షేత్రం వరకు సాగింది.

- ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో రథయాత్ర దసపల్లా హిల్స్‌లోని జగన్నాథ స్వామి ఆలయం వద్ద ప్రారంభమై సిరిపురం, హెచ్‌పీసీఎల్, ఏయూ ఔట్ గేట్, వీఎంఆర్డీఏ పార్క్ మీదుగా లాసన్స్ బే కాలనీలోని గుండిచా ఆలయం వరకు సాగింది. రథయాత్రలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.





ఇస్కాన్ ఆధ్వర్యంలో సంస్కృతిక కార్యక్రమాలు





ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో జగన్నాథస్వామి రథయాత్ర

విద్యార్థుల ఉన్నతికి ప్రోత్సాహం అందించాలి



సమావేశమైన జిల్లా యాదవ సంఘం సభ్యులు

మద్దిలపాలెం : విద్యార్థుల ఉన్నత చదువులకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు అన్నారు. కాటమ రాజు క్లబ్ 7వ వార్షికోత్సవం సమావేశం ఆదివారం శివాజీపాలెంలో ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు, జ్ఞాపికలు బహూకరించారు. అనంతరం సన్యాసిరావు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి ఆర్థిక తోడ్పాటు అందించాలని కోరారు. కాటమ రాజ్ క్లబ్ అధక్షుడు బొమ్మిడి సత్యనారాయణ అధ్యక్షత జరిగిన సమావేశంలో క్లబ్ కార్యదర్శి రాజాన బంగారురాజు, రవి, డాక్టర్ శ్యామ్ ప్రసాద్, డాక్టర్ వి.కేశవరావు, డాక్టర్ ఎస్.హరినాథ్, ఎల్వీ రమణ, కిషోర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ప్రోమోరన్



ప్రోమోరన్‌లో పాల్గొన్న నేవీ సిబ్బంది, రన్నర్లు

సింధియా: త్వరలో నిర్వహించనున్న వైజాగ్ నేవీ మారథాన్‌కు సన్నాహకంగా ఆదివారం తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో ప్రోమోరన్‌ను ఐఎన్ఎస్ కళింగ, వైలెన్స్ ట్రీట్ రిస్క్ అసెస్‌మెంట్, కమ్యూనికేషన్ నెట్‌వర్క్ సెంటర్ల సహకారంతో ఆర్కే బీచ్‌లో నిర్వహించారు. 9వ ఎడిషన్ డిసెంబర్ 15న నిర్వహించనున్నారు. రన్నర్లు, ఇండియన్ నేవీ సిబ్బంది శారీరక సౌష్టవంతో పాటు ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించడమే లక్ష్యంగా నిర్వహించిన ప్రోమోరన్‌ను హెరిటేజ్ వ్యాఖ్యాత జైషి హతంగడి జెండా ఊపి ప్రారంభించారు. రన్‌లో సుమారు 600 మంది నేవీ సిబ్బంది, రన్నర్లు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పీఎంపాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. నగరంలోని శ్యామల కూచిపూడి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుత నృత్యాలతో అలరించారు. గణపతి స్తుతి గీతానికి చేసిన నృత్యంతో కార్యక్రమం ప్రారంభం కాగా కళాకారులు దీక్షిత ,స్నిగ్ధ ప్రమిదలో వెలిగించిన దీపాలు చేతబూని ఘటాలపై ప్రదర్శించిన నృత్యాభినయాలు కార్యక్రమంలో ప్రత్యేకంగా నిలిచాయి. కళాకారులు మోక్షిత, సత్యవర్షిణి, రిషిత, జోషిత, శృతి, శ్రీజ, సహస్ర, అంజని, సమన్వి, కుందన ప్రియ, విద్య, ప్రణతి, లాస్య, శ్రావణి, దీక్షిత, చాందిని తదితరులు చేసిన నృత్యాలకు శ్యామల దర్శకత్వం వహించారు.

ఏబీఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పైలా ఆదిమోహన్‌రెడ్డి



ఆదిమోహన్‌రెడ్డి

దాబాగార్డెన్స్: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ(ఏబీఏపీ) రాష్ట్ర అధ్యక్షుడిగా నగరానికి చెందిన పైలా ఆదిమోహన్ రెడ్డి నియమితులయ్యారు. చీరాలలో ఆదివారం జరిగిన ఏబీఏపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో 2024–26కు సంబంధించి రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రచార సభ జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప దాసు తెలిపారు. ఈ మేరకు ఆదిమోహన్‌రెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. అధ్యక్షుడితో పాటు 25 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదిమోహన్‌రెడ్డి మాట్లాడుతూ అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేయడానికి కృషి చేస్తానన్నారు.

నవ్వుల్లో ముంచెత్తిన వినోదాల విందు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ స్కిట్స్ కార్యక్రమం హాస్యం పండించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు కళాకారులు స్కిట్లు ప్రదర్శించారు. వాటిలో తాత మనవడు మావ, గొట్టం గాడు, బ్యాంకు లోన్, అమలాపురం బస్సు, పిల్లిని చంపితే, సౌండ్ పార్టీ, జనాభా లెక్కలు, మిమ్మలనే ఫాలో అవుతున్నా, డాక్టర్ అలా చెప్పాడా స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజు, కుమారి, భానుప్రకాష్, రామానుజం, సూర్యం, శివజ్యోతి, ఇమంది ఈశ్వరరావు, నాయుడు, మల్లిక, నాగ గణేష్, సీతాగణేష్, భవాని, నాగరాజు అద్భుత హాస్యం, హావభావాలతో ప్రేక్షకలను నవ్వుల్లో ముంచెత్తారు.

లిఫ్ట్‌లో పడి మహిళ మృతి

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ లిఫ్ట్‌లో పడి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. శివాజీపాలేనికి చెందిన కనకమహాలక్ష్మి అనే మహిళ ద్వారకానగర్ మొదటి లేన్ బుధిల్ పార్కు సమీపంలోని ఓ దుకాణ కాంప్లెక్స్‌లో పనిచేస్తోంది. ఆదివారం మధ్యాహ్నం ఆమె కాంప్లెక్స్‌లోని లిఫ్ట్‌లో సామగ్రి తీసుకువెళ్తుండగా.. మూడో అంతస్తుకు వచ్చే మధ్యలో లిఫ్ట్ తలుపులు తెరుచుకున్నాయి. దీంతో అంతస్తును ఆనుకొని ప్రమాదవశాత్తు ఆమె పడిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ద్వారకా పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.